# కలల లోగిళ్లు!

**-పంచానన**



**లంకంత కొంప ... కావలసినంత డబ్బు ... నగలు ... చీరెలు ... నాకు ఏ రకమైన లోటూ లేదు. అన్నిటికీ మించి అందమైన, ఆస్తిపరుడైన భర్త. నగరంలో వేళ్లమీద లెక్కబెట్టదగ్గ అతి పెద్ద పారిశ్రామికవేత్తలలో ఆయనొకడు. ఆయనకు నేనంటే ఎంతో ప్రేమ. అది ఈ మధ్య కొద్దికొద్దిగా తగ్గుతోంది ... పరాయి స్త్రీలతో ఆయన తిరుగుతున్నట్టు అనుమానంగా ఉంది.**

అందుక్కారణం నేనే. ఆయన తనవెంట స్నేహితుల పార్టీలకు, క్లబ్బులకు రమ్మంటారు. నాకిష్టం ఉండదు. పోనీ, ఇంకెక్కడికైనా వెళదామా అని నన్నడిగితే బీచ్‌కి తీసుకెళ్లమంటాను. నాకు సముద్రమన్నా ... ఆ వచ్చేపోయే అలలన్నా చాలా ఇష్టం. ఆ ఇసుకలో కూర్చుని ఎదురుగా అనంత సాగరుడ్ని తదేకంగా చూస్తూ గుండె లోతుల్లో దుఃఖించటమంటే నాకు ఇష్టం. ఇష్టమంటే సరిపోదు అలా బాధపడటంలో ఏదో ఉపశమనం. అది ఆయన సాన్నిధ్యంలో అస్సలు కుదరదు. అందుకే ఎక్కడికీ వెళ్లలేను.

ఆయన టిఫిన్ చేసి బయటికి వెళ్లగానే నా గదిలోకొచ్చి బెడ్‌మీద వెల్లకిలా పడుకుని కాళ్లవైపు గోడకు వేళ్లాడుతున్న పెయింటింగ్ వైపు దృష్టి సారించాను. అది పెయిటింగ్ కాదు నా గదిలో సముద్రం! నిలువెత్తు తైలవర్ణ చిత్రంలో ఉన్నది ఓ మాతృమూర్తి. ఒళ్లో బిడ్డను పెట్టుకుని స్తన్యమిస్తూ అనంతానందాన్ని గ్రోలుతూ అరమోడ్పు కళ్లతో నా గుండెలో అగ్నిపర్వతాల్ని పేలుస్తోంది. మా పెళ్లిలో వర్మ నాకిచ్చిన బహుమానం అది. దాన్ని అతనే స్వయంగా చిత్రించాడు. అతనది నాకు బహుమానంగా ఇవ్వటంలో ఓ అర్థముంది.

నేను యూనివర్సిటీలో ఎమ్మే చదువుతున్న రోజుల్లో వర్మ బి.ఎఫ్.ఏ. (బాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్) చేస్తున్నాడు. అతని పెయింటింగ్స్ నన్నెంతో ఆకర్షించాయి. నేనతనికి చేరువయ్యాను. చేయి కలిపాను. అతనితో తిరిగాను ... తల్లిని కాబోయాను. ఆ సంగతి తెలిసి ఎగిరి గంతేశాడు వర్మ. పెళ్లి చేసుకుందామన్నాడు. నేనందుకు అంగీకరించలేదు. అతను ఏడ్చాడు. అయినా నేను లెక్కచేయలేదు. కారణం అతను పేదవాడవడమే. పెళ్లి చేసుకోననటమే కాదు, అబార్షన్ చేయించుకుంటానన్నాను. దాంతో వర్మ మరింత మ్రాన్పడిపోయాడు. నన్ను వారించటానికి ఎంతగానో ప్రయత్నించాడు. నేను మొండిదాన్ని. అతన్నొదిలి వెళ్లిపోయాను. ఆ తర్వాత నా పెళ్లికి అతనొచ్చాడు. నేను ఆహ్వానించలేదు. మా ఆయనకి వర్మ స్నేహితుడట. ఆయన తరుపున వచ్చి నాకీ చిత్రపటాన్ని బహూకరించాడు. అది బహుమానం కాదు నన్ను ప్రతిక్షణం చిత్రవధ చేసే మారణాయుధం. అవును, మారణాయుధమే! ఎందుకంటే నాకు అబార్షన్ జరిగిన తర్వాత మళ్లీ పిల్లలు పుట్టలేదు ... పుట్టరని డాక్టర్లు చెప్పారు.

అది మొదలు ఆ పెయింటింగ్ నాకు ప్రాణప్రదమయింది. గాయపడిన హృదయమయింది. నా హృదయ వేదనయింది. నా బాధనంతా రోజూ సాయంత్రం సముద్రానికి నివేదించుకోవడం ... ఆ సముద్రాన్ని నా గది గోడకు వేళ్లాడే పెయింటింగ్‌లో చూసుకోవడం అలవాటైపోయింది.

రాన్రానూ నా బతుకు నాకే అర్థం కాక ఓ మోడరన్ ఆర్ట్‌లా తయారయింది. ఏం చేయాలో తోచని పరిస్థితి. ఎవరికీ సహాయపడలేని దుస్థితి. నేను పాపం చేశానన్న భావన నన్ను వెంటాడుతూ నా కళ్లల్లో నిరాశని నింపుతోంది. అది మా ఆయనలో అనుమానాలకు దారితీస్తూ నా పట్ల అనాశక్తిని పెంపొందించసాగింది. అది ఆయనని బలహీనపరిచింది. అయితే నాకు ఆ విషయంలో ఏ చింతా లేదు. కానీ భవిష్యత్తులో నా బతుకు ఎలా ఉండబోతుందో నన్న దిగులు ఎక్కువయింది. చచ్చిపోవాలనిపించింది. మళ్లీ అది పరిష్కారం కాదనిపించింది. ఒక్కోసారి వర్మ దగ్గరికే వెళ్లిపోవాలనిపిస్తుంది. అలా అనిపించినప్పుడల్లా ఆలోచిస్తే అదెంతో స్వార్థమనిపించింది. నన్నిప్పటికీ అతను ప్రేమిస్తున్నాడని నాకు తెలుసు. నేను వెళ్తే నన్ను ఆదరించి ఆరాధించే హృదయం అతనికుందని తెలుసు. కనీసం అతనికి మోడల్‌గానైనా పనిచేసి తృప్తిపడాలనుకున్నాను.

అలా నా ఆలోచనలు కొద్దికాలం అలాగే సాగాయి.

చివరికొక నిర్ణయానికొచ్చాను. దాంతో నా గుండెలో గూడు కట్టుకున్న దిగులుమేఘాలు చెల్లాచెదురయ్యాయి. మనసు దూదిపింజలా తేలిపోయింది.

అది మొదలు ఆయన ఇల్లు వదిలిపెట్టిన వెంటనే నేనూ బయటికి పోయేదాన్ని. ఆయనకంటే ముందుగా సాయంత్రం ఇల్లు చేరేదాన్ని. నాలో చాలా మార్పు వచ్చింది. నా ముఖంలో వెలుగు నిండింది.

ఓ రోజు

"నీ ప్రవర్తనేం బాగులేదు, తారా!" అన్నారు మావారు సాలోచనగా.

"... ..." చేతులు కట్టుకుని వినడానికి సిద్ధపడ్డాను.

"రోజూ నేను బయటికెళ్లాక నువ్వెక్కడికెళ్తున్నావో నాకు తెలియదనుకుంటున్నావా?" నన్ను తప్పుపట్టడానికి ప్రయత్నిస్తున్నారాయన.

"... ..." ముఖం అటు తిప్పుకుని రెప్పలు వాల్చి మాట్లాడుతున్న ఆయన్నే గమనిస్తున్నాన్నేను.

అది పెయింటింగ్ కాదు నా గదిలో సముద్రం! నిలువెత్తు తైలవర్ణ చిత్రంలో ఉన్నది ఓ మాతృమూర్తి. ఒళ్లో బిడ్డను పెట్టుకుని స్తన్యమిస్తూ అనంతానందాన్ని గ్రోలుతూ అరమోడ్పు కళ్లతో నా గుండెలో అగ్నిపర్వతాల్ని పేలుస్తోంది.



"ఎక్కడెక్కడి కెళ్తున్నావో ... ఎవరెవర్ని కలుస్తున్నావో ..." ఆయన నోట్లోంచి అసభ్యకరమైన మాటలు రానివ్వకూడదనుకున్నాను.

"ఉషని మీరు పెళ్లి చేసుకోడానికి నేను మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నాను!" తలదించుకుని గోళ్లు కొరుకుతూ అన్నాను.

పక్కలో బాంబు పడినట్టు అదిరిపడి తలతిప్పి నన్ను చూశారు. ఆయన ఊహించలేదు నేనలా మాట్లాడతానని. గత రెండు నెలలుగా ఆయన, ఉష కలిసి తిరుగుతున్నారని నాకు తెలుసు. ఇద్దరూ చాలా సన్నిహితులవ్వటం ... పెళ్లి చేసుకుంటే బాగుండునని చర్చించుకోవడమూ నాకు తెలుసు. వారిమధ్య నేనే అడ్డు తెరని ... దాన్నెలాగైనా తొలగించుకోవాలని ఆయన ప్రయత్నించబోయారు. నా మాటతో తెల్లముఖం వేశారు.

"అవునండీ ...! మనసా వాచా కర్మణా నేనంటున్న మాట ఇది. నా కెలాగూ పిల్లలు పుట్టరు. ఆ ఒక్క సాకు చాలు మీ రిద్దరూ ఒకటవ్వటానికి. ఇంకా మీ మధ్య నేనుండటం ఇబ్బందిగా ఉంటే చెప్పండి నేను ఈ ఇల్లు వదలిపెట్టి ఎక్కడికైనా వెళ్లిపోతాను!" అన్నాను.

ఆయన నుదుటిపై ముచ్చెమటలు పోశాయి.

"తారా!...." ఏదో అనబోయాడు.

"ఊహాప్రమేయమైన నిందలు నా మీద మోపకండి, ప్లీజ్ ... మీ నిర్ణయం చెప్పండి చాలు!" అన్నాను.

"అది కాదు, తారా! నిన్ను నేను తప్పుగా అర్థం చేసుకున్నాను ..."

"వద్దండీ! ఇంక ఎలాంటి మాటలూ వద్దు. మీ నిర్ణయం ఒక్కటీ చెప్పండి, అంతే చాలు. మీరు ఏ రకంగానో కాకుండా ఇలా పెళ్లి చేసుకుని సుఖంగా ఉండటమే నేను కోరుకునేది!"

"థాంక్స్ ... థాంక్యూ, తారా! నీకు నచ్చిన చోట నువ్వుండు. అది నీ ఇష్టం. నువ్వెక్కడున్నా నీ కే కష్టమూ రానివ్వను!" కృతజ్ఞతాపూర్వకంగా అన్నాడాయన.

"చాలు ... మీ హృదయంలోంచి నన్ను తరిమేయకుండా ఉంటే చాలు!" అంటూ బయటికి నడిచాను.

అలా బయటికి నడిచిన నేను మళ్లీ ఆ ఇంటికి రాలేదు. నేను పనిచేస్తున్న అనాథ శరణాలయమే నాకు ఆశ్రయమయింది. అనాథ బాలలే నా కలల లోగిళ్లయ్యారు. □

